కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న

మొదటిపేజీ తరువాయి...

2019లో ఈ పురస్కారాన్ని ప్రకటించింది.



క్విట్ ఇండియా ఉద్యమంలో జైలుకు

1924, జనవరి 24న కర్పూరి ఠాకూర్ నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీలో జన్మించారు. 1970లో బీహార్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం విధించిన సీఎంగా ఠాకూర్ గుర్తింపు పొందారు. కర్పూరి ఠాకూర్ జన్మించిన సమస్తిపూర్ జిల్లాలోని గ్రామం పేరును ఆయన మరణాంతరం కర్పూరి గ్రామంగా మార్చారు. యుక్త వయసులో స్వాతంత్ర్య ఉద్యమం వైపు కర్పూరి మళ్లారు. 1942-1945 మధ్య క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టై కొన్ని నెలల పాటు జైలు జీవితం గడిపారు. 1952లో తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తేజ్‌పూర్ నియోజకవర్గం నుంచి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1967-68 మధ్య రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా సేవలందించారు.

బీహార్‌లో రిజర్వేషన్ల అమలుకు ఆద్యుడు

స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా వంటి వ్యక్తుల నుంచి కర్పూరి ఠాకూర్ స్ఫూర్తి పొందారు. కర్పూరికి జయప్రకాశ్ నారాయణకు సన్నిహితుడిగా పేరున్నది. తొలి విడతలో సోషలిస్టు పార్టీ నుంచి సీఎంగా చేసిన ఠాకూర్.. రెండో టర్మ్‌లో జనతా పార్టీ సీఎంగా పని చేశారు. మండల్ కమిషన్‌కు ముందుదిగా భావించే ముంగేరి లాల్ కమిషన్ సిఫారసులను(రాష్ట్రంలో బలహీనవర్గాలకు రిజర్వేషన్లు) అమలు చేసిన సీఎంగా ఠాకూర్ కాలాన్ని ప్రముఖంగా గుర్తుంటుంది. వ్యక్తిగతంగా నిరాడంబరంగా ఉన్న కర్పూరి ఠాకూర్ ఎంతో మందికి స్ఫూర్తి అని, భారత రాజకీయాల్లో ఆయన భాగస్వామ్యం చెరగని ముద్ర అని చెబుతుంటారు.

లాలూ, నితీశ్, పాశ్వాన్‌లకు గురువు

బీహార్‌లో ఓబీసీ రాజకీయాలకు పునాది వేసిన వారిలో కర్పూరి ఠాకూర్ ప్రథములు. జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చిన పిలుపుతో ఎంతో మంది ఉద్యమంలోకి రాగా.. అలా వచ్చిన వారిలో లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్, రాంవిలాస్ పాశ్వాన్ వంటి నేతలకు ఠాకూర్ రాజకీయ గురువు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా గుర్తింపు పొందిన కర్పూరి ఠాకూర్ 1988, ఫిబ్రవరి 17న తుదిశ్వాస విడిచారు.

కర్పూరి జీవితం స్ఫూర్తిదాయకం

అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి, సమానత్వం, సాధికారత కోసం కర్పూరి ఠాకూర్ తిరుగులేని నిబద్ధతతో పనిచేశారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. విజనరీ నాయకత్వం ద్వారా దేశ సామాజిక-రాజకీయ నిర్మాణంలో ఆయన చెరగని ముద్ర వేశారు. సమ, న్యాయమైన సమాజం కోసం ఆయన చేసిన కృషిని కొనసాగిస్తాం.

- నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

ఏండ్ల డిమాండ్ నేటికి నెరవేరింది..

కర్పూరి ఠాకూర్‌కు భారత రత్న పురస్కారం ప్రకటన సంతోషకరం. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ఠాకూర్‌కు భారత రత్న ఇవ్వాలని మా పార్టీ ఏండ్లుగా చేస్తున్న డిమాండ్ నేటికి నెరవేరింది. దళితులు, వెనుకబడిన వర్గాలు సహా సమాజంలోని అన్ని అణగారిన వర్గాలకు ఇది ఒక సానుకూల సందేశం పంపుతుంది.

- నితీశ్ కుమార్, బీహార్ సీఎం

అయోధ్యలోని రామాలయంలో బాలరాముడి దర్శనం కోసం మంగళవారం భారీగా తరలి వచ్చిన భక్తులు

తొలిరోజు 5 లక్షలు!

అయోధ్యకు పోటెత్తిన భక్తులు

బాలరాముడి దర్శనానికి లక్షలాదిగా తరలిన ప్రజలు

భక్తులను నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించిన సిబ్బంది

అయోధ్య, జనవరి 23: అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరుగగా, మంగళవారం నుంచి సామాన్య భక్తులకు రామయ్య దర్శనభాగ్యం కల్పించారు. వేకువజామునే ఆలయం వద్దకు లక్షలాది మంది తరలివచ్చారు. ప్రధాన మార్గమైన 'రామ్ పథ్' వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోకి భక్తులను అనుమతించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారిని నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఆలయం వద్ద పెద్ద క్యూలు దర్శనమిచ్చాయి. కొంత మంది భక్తులు పోలీసు లైన్లను కూడా దాటుకొంటూ వెళ్లారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయం వద్ద తోపులాట జరిగింది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి దాదాపు 2.5 లక్షల మంది ఆలయానికి వచ్చారని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ పేర్కొన్నారు. తొలి రోజు దాదాపు 5 లక్షల మంది రాములోరిని దర్శించుకునే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనావేశారు.

సోమవారం రాత్రి నుంచే పడిగాపులు

ప్రాణప్రతిష్ఠ జరిగిన సోమవారానికి ముందే భక్తులు అధిక సంఖ్యలో అయోధ్యకు చేరుకొన్నారు. వీరంతా నగరంలోని పలు చోట్ల విడిది చేశారు. రామ్‌లల్లా దర్శనం కోసం వీరంతా మంగళవారం ఉదయాన్నే ఒక్కసారిగా ఆలయం వద్దకు చేరుకోవడంతో రద్దీ ఏర్పడింది. కొంత మంది సోమవారం రాత్రి నుంచే మెయిట్ గేట్ బయట వేచిచూస్తున్నారు. ఆలయం ప్రవేశమార్గం రామ్‌పథ్ వద్ద భక్తులు ఇసుకేస్తే రాలనంతగా కనిపించారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఆలయంలోకి ప్రవేశించేందుకు ముందుకు కదిలారు. మధ్యాహ్నానికి ఈ సంఖ్య మరింత పెరుగడంతో.. భక్తులను నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది కష్టపడ్డారు. ప్రవేశ మార్గం వద్ద తోపులాటలో ఒక భక్తుడు స్పృహ తప్పి పడిపోయాడు. భక్తులు సజావుగా బాలరాముడిని దర్శించుకొనేందుకు క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలు తీసుకొంటున్నట్టు అధికారులు వెల్లడించారు. 8 వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, పరిస్థితి నియంత్రణలో ఉన్నదని యూపీ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ శిశిర్ తెలిపారు.

250 కోట్ల ఏండ్ల నాటి శిలతో బాలక్‌రామ్ విగ్రహం తయారీ

శతాబ్దాల ఎదురుచూపులు ఫలించి 500 ఏండ్ల తర్వాత అయోధ్యలో కొలువైన రామచంద్రుని చూసి కోట్లాది మంది భక్తులు పులకించిపోతున్నారు. అయోధ్య రామాలయంలోని గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన బాలరాముని విగ్రహంలో ఉట్టిపడుతున్న జీవకళ శిల్పకారుని చాతుర్యాన్ని చాటుతుండగా, ఆ ప్రతిమకు సంబంధించి కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 51 అంగుళాల బాలరాముడి విగ్రహాన్ని తయారు చేసిన శిల 250 కోట్ల ఏండ్ల నాటిదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతిమ తయారీకి వినియోగించిన శిలపై భౌతిక-యాంత్రిక విశ్లేషణ చేయగా అది 250 కోట్ల ఏండ్ల క్రితం నాటిదని నిర్ధారణ అయినట్టు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) డైరెక్టర్ హెచ్ఎస్ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ శిల చాలా పటిష్టమైనదని, ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకుంటుందని, కొద్దిపాటి నిర్వహణతోనే ఈ ఉష్ణమండలంలో వేల సంవత్సరాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుందని వెంకటేశ్ తెలిపారు. భూమి ఏర్పడిన తర్వాత ఉడుకుతున్న లావా చల్లారినప్పుడు చాలా గ్రానైట్ రాళ్లు తయారవుతాయని, అలాంటి గ్రానైట్ చాల దృఢంగా ఉంటుందని ఆయన చెప్పారు. కాగా, ఆలయ నిర్మాణంలో సంప్రదాయ డిజైన్లతో తీర్చిదిద్దిన శిలలు చాలా నాణ్యమైనవని, వెయ్యేండ్లకు పైగా చెక్కుచెదరకుండా ఉండేలా ఆలయాన్ని నిర్మించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

'బాలక్ రామ్'గా అయోధ్య రామయ్య

అయోధ్యలో ఆలయంలో ప్రాణప్రతిష్ఠ జరుపుకొన్న బాలరాముడికి 'బాలక్ రామ్'గా నామకరణం చేసినట్టు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాలుపంచుకొన్న పూజారి అరుణ్ దీక్షిత్ మంగళవారం వెల్లడించారు. అయోధ్యలో కొలువుదీరన రామచంద్రమూర్తి ఐదేండ్ల పసిబాలుడిగా భక్తులకు దర్శనమిస్తున్నాడని, అందుకే ఈ పేరును నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.

ఆలయంలోనే మరో రెండు విగ్రహాలు..

కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ నల్లరాయితో రూపొందించిన బాలరాముడి విగ్రహాన్ని అయోధ్యలో ఆలయంలో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. మరోవైపు రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ఎంపిక సమయంలో పరిగణనలోకి తీసుకొన్న మరో ఇద్దరు శిల్పులు చెక్కిన విగ్రహాలను కూడా ఆలయంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంచనున్నట్టు ఆలయ వర్గాలు వెల్లడించాయి. అయితే ఆ రెండు విగ్రహాల ఫొటోలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు బయటకు రాలేదు. వాటిల్లో రాజస్థాన్‌కు చెందిన శిల్పి సత్యనారాయణ్ పాండే తెల్ల మార్బుల్‌తో రూపొందించిన రామ్‌లల్లా విగ్రహం ఫొటో ఒకటి తాజాగా బయటకు వచ్చింది. ఈ తెల్ల మార్బుల్ విగ్రహం ప్రస్తుతం ఆలయ ట్రస్టు వద్ద ఉన్నది. కుడి చేతిలో బాణం, ఎడమ చేతిలో విల్లుతో బాలరాముడు అందులో దర్శనమిస్తున్నాడు. విగ్రహం వెనుక భాగంలో విష్ణు అవతారాలకు సంబంధించిన చిన్న శిల్పాలు ఉన్నాయి.

తెల్ల మార్బుల్‌తో రూపొందించిన రామ్‌లల్లా విగ్రహం

బ్రిటన్‌ను వణికిస్తున్న ఇషా తుఫాన్

ఫ్రాన్స్, జర్మనీకి విమానాల మళ్లింపు

లండన్, జనవరి 23: భీకరమైన ఇషా తుఫాన్ తాకిడికి బ్రిటన్, ఐర్లాండ్‌లలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. 100కు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. రైల్వే సేవల్ని నిలిపివేస్తున్నట్టు రైల్ ఆపరేటర్లు మంగళవారం ప్రకటించారు. లండన్, డబ్లిన్ సహా పలు విమానాశ్రయాల్లో వేలాదిమంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. సరైన తిండి, నిద్రలేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని ప్రయాణికులు సోషల్‌మీడియాలో ఫొటోలు, వీడియోలు విడుదల చేస్తున్నారు. ఒక్క డబ్లిన్‌లోనే 160 ఫ్లైట్స్ రద్దయ్యాయి. పలు విమానాల్ని ఫ్రాన్స్, జర్మనీకి దారిమళ్లించటంతో ప్రయాణికులు దిగాల్సిన చోట కాకుండా, మరో చోటకు చేరుకున్నారు. అధికారులు బ్రిస్టోల్, లండన్, డబ్లిన్ ఫ్లైట్స్‌ను పారిస్‌కు, స్కాట్లాండ్ ఫ్లైట్‌ను జర్మనీ నగరం కోగ్నేకు దారిమళ్లించారు. దీంతో వందలాది మంది యూకే ప్రయాణికులు సోమవారం రాత్రంతా విదేశాల్లోని విమానాశ్రయాల టెర్మినల్స్ వద్ద తలదాచుకోవాల్సి వచ్చింది.

2 ఏండ్లు పరిమితి

విదేశీ విద్యార్థుల వీసాలపై కెనడా సర్కారు కీలక నిర్ణయం

- స్టడీ వీసాల్లో 35 శాతం కోత
- భారతీయ విద్యార్థులపై ప్రభావం

ఒట్టావా, జనవరి 23: దేశంలో పెరుగుతున్న ఇండ్ల కొరత, నిరుద్యోగానికి చెక్ పెట్టేందుకు కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. విదేశీ విద్యార్థుల వీసాలపై రెండేండ్లు పరిమితి విధించింది. పరిమితిలో భాగంగా 2024లో ఇప్పుడిస్తున్న వీసాల్లో 35 శాతం కోత విధించనున్నట్టు ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ వెల్లడించారు. పరిమితి అమల్లోకి వచ్చిన తర్వాత 3,64,000 మందికి వీసాలు లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుడు 5,60,000 మందికి వీసాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. విదేశీ విద్యార్థుల అనుమతి విధానాన్ని మరింత మెరుగుపర్చి వారికి ఉన్నతమైన విద్యనందించడమే పరిమితి వెనుకున్న ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. 2025కు సంబంధించి జారీ చేసే వీసాల సంఖ్యను ఈ ఏడాది చివర్లో వెల్లడిస్తామని స్పష్టం చేశారు. కెనడా ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల ఆ దేశానికి అధిక సంఖ్యలో వెళ్లే భారతీయ విద్యార్థులకు నిరాశ ఎదురైంది.

మాస్టర్స్, డాక్టోరల్ విద్యార్థులకు వర్తించదు

మాస్టర్స్, డాక్టోరల్ విద్యార్థులకు తాజా పరిమితులు వర్తించవని మిల్లర్ తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం ప్రావిన్స్‌ల వారీగా పర్మిట్లను కేటాయిస్తారు. అక్కడి సంస్థలు, వనరుల ఆధారంగా స్థానిక ప్రభుత్వాలు వాటిని పంపిణీ చేయాలి. ఆయా సంస్థల అనుమతి కోరుతూ వచ్చిన పర్మిట్ల దరఖాస్తులపై ప్రావిన్స్ లేదా టెరిటరీలు ఆమోద లేఖ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ మార్పులు, చేర్పులు చేసేందుకు మార్చి 31 వరకు గడువిచ్చారు.

వర్క్ పర్మిట్లలోనూ మార్పులు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లకు సంబంధించిన అర్హతల్లోనూ కెనడా ప్రభుత్వం మార్పులు చేసింది. 2024 సెప్టెంబర్ నుంచి కరికులం లైసెన్సింగ్ అరేంజ్‌మెంట్స్ విభాగంలో విద్యార్థులకు వర్క్ పర్మిట్ ఇవ్వబోమని తెలిపింది. అయితే మాస్టర్స్ ప్రోగ్రామ్ కింద నమోదైన గ్రాడ్యుయేట్లు మూడేండ్ల వర్క్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు అనుమతించారు.

ఆస్ట్రేలియా 'గోల్డెన్ వీసాలు' రద్దు

వృత్తి నిపుణులకు మరిన్ని వీసాలు • భారతీయులపై ప్రభావం తక్కువే!

సిడ్నీ, జనవరి 23: విదేశాలకు చెందిన సంపన్న పెట్టుబడిదారులకు ఇచ్చే 'గోల్డెన్ వీసా' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఆస్ట్రేలియా ప్రకటించింది. సిగ్నిఫికెంట్ ఇన్వెస్టర్ వీసా (ఎస్ఐవీ)గా పిలిచే ఈ పథకం కింద విదేశీ ఇన్వెస్టర్లు ఆ దేశంలో నివసించే వెసులుబాటు ఉంది. అయితే ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో దీనిని రద్దు చేస్తున్నట్టు ఆ దేశ హోం శాఖ మంత్రి క్లేర్ ఓ నీల్ ప్రకటించారు. దాని స్థానంలో వృతి నిపుణులకు ఇచ్చే వీసాల సంఖ్యను పెంచుతున్నట్టు తెలిపింది. దేశంలో పెట్టుబడులను పెట్టే వారిని ఆకర్షించడానికి ఆస్ట్రేలియా ప్రభుత్వం గోల్డెన్ వీసాను 2012లో ప్రవేశపెట్టింది. 5 మిలియన్ల ఆస్ట్రేలియా డాలర్లు ఆ దేశంలో పెట్టుబడిగా పెడితే వారికి గోల్డెన్ వీసా లభిస్తుంది. అయితే దీని ద్వారా అవినీతి సొమ్ము వస్తున్నదని ఆ దేశంలో విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ విమర్శలకు తోడు దాని నుంచి ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాకపోవడంతో దానిని రద్దు చేస్తున్నట్టు ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. అయితే దీని ప్రభావం భారతీయులపై తక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆస్ట్రేలియాలో గోల్డెన్ వీసా కింద పెట్టుబడులు పెట్టిన వారిలో చైనా దేశీయులు 85 శాతంతో మొదటి స్థానంలో ఉన్నారు. భారత్ 17వ స్థానంలో ఉన్నది.

క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో

జవాన్ మృతి

మధ్యప్రదేశ్‌లో ఘటన

టికాంగఢ్ (మధ్యప్రదేశ్), జనవరి 23: దేశంలో ఇటీవల చిన్నారులు, యువత గుండెపోటుతో మరణిస్తున్నట్టు ఘటనలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. సోమవారం ఉత్తరప్రదేశ్‌లో ఐదేండ్ల బాలిక గుండెపోటుతో మరణించగా, తాజాగా మధ్యప్రదేశ్‌లోని టికాంగఢ్ జిల్లాలో 35 ఏండ్ల ఆర్మీ జవాన్ క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మరణించాడు. సెలవుపై ఇంటికి వచ్చిన లాన్స్ నాయక్ వినోద్ భాస్కర్ తోటి స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారి ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే అతడిని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు.

ఇదేం అరాచకం?

గుజరాత్ పోలీసులపై 'సుప్రీం' ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 23: గుజరాత్‌లో ముగ్గురు ముస్లింలను స్తంభాలకు కట్టేసి కర్రలతో కొట్టిన పోలీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదేం అరాచకమని నిలదీసింది. వారిపై ఉన్న కోర్టు ధిక్కరణ అభియోగాలపై స్టే పొడిగిస్తున్నట్టు మంగళవారం వెల్లడించింది. 'ప్రజలను స్తంభాలకు కట్టేసి కొట్టే అధికారం చట్ట ప్రకారం మీకుందా' అని ధర్మాసనం నిందితులను ప్రశ్నించింది. ఈ కేసుకు సంబంధించిన ఘటన అక్టోబర్ 2022న ఖేడా జిల్లాలోని ఉండేలా గ్రామంలో జరిగింది. గర్బా నృత్య కార్యక్రమంపై ముస్లిం గుంపు రాళ్లు రువ్వడంతో కొందరు పోలీసులు, గ్రామస్థులకు గాయాలయ్యాయని ఆరోపణలు వచ్చాయి.

అమెరికాలో 98% పెరిగిన ఉద్యోగ కోతలు

- ఆర్థిక అనిశ్చిత పరిస్థితులే కారణం
- ఈ ఏడాదిలోనూ తొలగింపులు
- ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ నివేదిక

వాషింగ్టన్, జనవరి 23: అమెరికా కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత ఏడాది ఏకంగా 721,677 మందిపై వేటు వేశాయి. అంతకుమునుపు ఏడాది 363,832 మందిని తొలగించాయి. 2022తో పోలిస్తే 2023లో ఉద్యోగాల తొలగింపులు 98 శాతం పెరిగాయని ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంగానే కంపెనీలు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయని తెలిపింది. అమెజాన్, మెటా వంటి టెక్ కంపెనీలే గత ఏడాది 1.68 లక్షల మందికి ఉద్వాసన పలికాయని పేర్కొన్నది. ఈ ఏడాది పరిస్థితులు మరింత అధ్వానంగా ఉండనున్నట్టు నిపుణులు అంచనావేస్తున్నారు. కృత్రిమ మేధ కారణంగా సాంకేతిక రంగం చెప్పుకోదగ్గ మార్పులకు లోనుకావడం ఉద్యోగాలపై ప్రభావం చూపుతున్నది. రిటైల్ రంగంలోనూ గత ఏడాది 78,840 ఉద్యోగాలను కంపెనీలు తొలగించాయి. స్టోర్ల మూసివేత, దివాలా కూడా ఉద్యోగుల తొలగింపుపై ప్రభావం చూపుతున్నది. 2023లో 34 శాతం కంపెనీలు ఉద్యోగులకు బోనస్ ఇవ్వలేదు.

ఎన్నికలు ఉన్నాయని వచ్చావా?

- పదేండ్లలో ఇప్పుడే గుర్తొచ్చామా?
- రాములోరి గుడి శంకుస్థాపనకు వచ్చిన కర్ణాటక బీజేపీ ఎంపీని నిలదీసిన దళితులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రామాలయ నిర్మాణాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నారంటూ దళితులు నిరసన తెలపడంతో ఓ బీజేపీ ఎంపీ కంగుతిన్నారు. స్థానిక ఆలయ శంకుస్థాపన చేయకుండానే వెనుదిరిగారు. అయోధ్యలో రామమందిర బాల రాముడి విగ్రహానికి ఉపయోగించిన రాతిని కర్ణాటకలోని మైసూరు వద్దనున్న గుజ్జెగౌడనపుర గ్రామం నుంచి తీసుకువెళ్లారు. దాంతో విగ్రహం ప్రాణప్రతిష్ఠ సమయంలోనే గ్రామంలో కూడా రామాలయానికి శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు జరిగాయి. అయితే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా హాజరు కావాల్సి ఉండగా, అక్కడి దళితులు అతన్ని కార్యక్రమానికి హాజరుకాకుండా అడ్డుకున్నారు. దీంతో ఆయన కార్యక్రమానికి హాజరు కాకుండానే వెనుదిరిగారు. ఎంపీ ప్రతాప్ సింహా ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి గత పదేండ్లలో ఏనాడూ గ్రామానికి రాలేదని, ఇప్పుడు రామాలయ నిర్మాణాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని గ్రామానికి వచ్చారని దళిత నాయకుడు సురేశ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలను రెచ్చగొట్టి తనను అడ్డుకున్నారని ప్రతాప్ సింహా ఆరోపించారు.

రైతులకు కేంద్రం దగా

- రూ.లక్ష కోట్ల వ్యవసాయ నిధుల్ని వెనక్కి తీసుకున్న మోదీ సర్కారు
- బడా కార్పొరేట్లకు మాత్రం రూ.14.56 లక్షల కోట్లు రైటాఫ్
- సంయుక్త కిసాన్ మోర్చా ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 23: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి కేటాయించిన రూ.1,05,543 కోట్లను మోదీ సర్కార్ వెనక్కి తీసుకోవటంపై సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ రైతాంగాన్ని మోదీ సర్కార్ దగా చేస్తున్నదని, కేంద్రంలో అధికార బీజేపీకి రైతులు తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర వ్యవసాయ శాఖ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2018-19లో వ్యవసాయానికి కేటాయించిన మొత్తం బడ్జెట్ నిధులు రూ.54,000 కోట్లుకాగా, ఇందులో రూ.21,043 కోట్లు సరెండర్ అయ్యాయి. అలా వరుసగా ఐదేండ్లలో రూ.లక్ష కోట్లకుపైగా వ్యవసాయ నిధుల్ని కేంద్రం వెనక్కి తీసుకుంది. 'దేశ రైతాంగాన్ని రుణ బాధల నుంచి విముక్తి చేస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రైతులకు వాగ్దానం చేసింది. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత, దేశంలోని బడా కార్పొరేట్ కంపెనీల రూ.14.56 లక్షల కోట్ల రుణాల్ని మోదీ సర్కార్ రైటాఫ్ చేసింది. రైతు రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు' అని ఎస్‌కేఎం పేర్కొన్నది. ఎన్ఆర్‌బీ గణాంకాల ప్రకారం, 2014-22 మధ్య 1,00,474 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేసింది.

పార్లమెంట్ భద్రతకు 140 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది

న్యూఢిల్లీ, జనవరి 23: పార్లమెంట్ భద్రత కోసం 140 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించారు. ఈ నెల 31 నుంచి బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో వీరిని మోహరించినట్టు అధికారులు తెలిపారు. సందర్శకులను, వారి లగేజ్‌లను వీరు తనిఖీ చేస్తారని చెప్పారు. గత పార్లమెంట్ సమావేశాలలో భద్రతను ఉల్లంఘించి డిసెంబర్ 13న ఇద్దరు వ్యక్తులు విజిటర్ గ్యాలరీ నుంచి దూకి వచ్చి లోక్‌సభలో అలజడి సృష్టించడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

ఏప్రిల్ 16 నుంచి లోక్‌సభ ఎన్నికలు!

- ఢిల్లీ సీఈవో అంతర్గత నోట్ వైరల్
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ
- అధికారులకు రిఫరెన్స్ కోసమే ఆ తేదీ
- ఢిల్లీ సీఈవో కార్యాలయం వివరణ

న్యూఢిల్లీ, జనవరి 23: సార్వత్రిక ఎన్నికలపై ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి జారీ చేసిన ఓ అంతర్గత నోట్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఏప్రిల్ 16ను లోక్‌సభ ఎన్నికలకు రిఫరెన్స్ తేదీగా పేర్కొంటూ ఢిల్లీ సీఈవో జారీచేసిన నోట్ వైరల్‌గా మారింది. ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు ఉంటాయని, ఏప్రిల్ 16ను తాత్కాలిక తేదీగా భావించి ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలంటూ జర్నలిస్టులు, మీడియా సంస్థలు ఢిల్లీ సీఈవో కార్యాలయాన్ని సంప్రదించాయి. దీంతో ఢిల్లీ సీఈవో కార్యాలయం 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్లానర్ ప్రకారం పోలింగ్ ఏర్పాట్లు చేసుకునేందుకు జిల్లా రిటర్నింగ్ అధికారులకు రిఫరెన్స్ కోసమే ఆ తేదీని సర్క్యులర్‌లో పేర్కొన్నట్టు స్పష్టం చేసింది. గత సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే.. కేంద్ర ఎన్నికల సంఘం 2019 మార్చి 10న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 11న మొదలైన లోక్‌సభ పోలింగ్, ఏడు దశల్లో సాగింది. ఆ ఏడాది మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టింది.